# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

VC NEWS

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ శుక్రవారం 07 ఆగస్టు 2026

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:03 సంచిక: 31

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




రోడ్డుప్రమాదంలో గ్యాంగ్‌స్టర్ అతీక్ కొడుకు దుర్మరణం

## డిజిటల్ చెల్లింపులపై
# చార్జీలు

### యూపీఐ ద్వారా చేసే పేమెంట్లపై బాదుడుకు కేంద్రం రెడీ

**ఇప్పటిదాకా యూపీఐతో పాటు రూపే చెల్లింపులపై జీరో చార్జీలు**

**ఇకపై ఎప్పటికప్పుడు చార్జీలు విధించే అధికారం ప్రభుత్వానికి..**

**చట్టం సవరణ.. లోక్‌సభ ఆమోదం**

**డిజిటల్ నుంచి మళ్లీ క్యాష్ వైపు మళ్లించే చర్యలంటూ విమర్శలు**

పల్లె నుంచి పట్నం వరకు దాదాపు అన్ని నగదు లావాదేవీలు ఇప్పుడు డిజిటల్ పద్ధతిలోనే జరుగుతున్నాయి. అది రూపాయి అయినా వేల రూపాయలైనా సరే..స్మార్ట్ ఫోన్ ద్వారా క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే చాలు.. చిటికెలో చెల్లింపు జరిగిపోతోంది. అదీ ఎలాంటి చార్జీ లేకుండా..పూర్తి ఉచితంగా. కానీ ఇప్పుడా పరిస్థితి మారనుంది. డిజిటల్ పద్ధతిలో సులువుగా చెల్లింపులు జరిపేందుకు వీలు కల్పిస్తున్న యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) విధానం ఇకపై ఆర్థికంగా భారం కానుంది.




న్యూఢిల్లీ,ఆగస్ట్ 6 : ఇప్పటివరకు ఉచితంగా కొనసాగుతున్న యూపీఐ సర్వీసు మీద భవిష్యత్తులో చార్జీలు విధించబోయే పరిస్థితి రానుంది. యూపీఐ చెల్లింపులపై ఫీజులు విధించడానికి బ్యాంకులు, పేమెంట్ సిస్టం ప్రొవైడర్స్‌ని అనుమతించేలా ప్రభుత్వానికి అధికారమిచ్చే చట్ట సవరణను లోక్‌సభ ఆమోదించింది. రూపే డెబిట్ కార్డు ద్వారా చెల్లింపులపైనా చార్జీలు విధించడానికి ఇది మార్గం సుగమం చేయనుంది. యూపీఐ వ్యవస్థ నిర్వహణ భారం తడిసి మోపెడవుతోందని, చార్జీలు వసూలు చేసుకునేందుకు వీలు కల్పించాలంటూ బ్యాంకులు, పేమెంట్

-మిగతా 2 లో..

## రాయదుర్గం భూముల కేసులో సుప్రీం కీలక ఆదేశాలు



న్యూఢిల్లీ: హైదరాబాద్ రాయదుర్గం భూముల కేసులో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. టీజీఐఐసీ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ ముగిసిందని తెలిపింది. ఈ క్రమంలోనే తెలంగాణ హైకోర్టు ఆదేశించిన డ్రోన్ సర్వేపై సుప్రీంకోర్టు స్టే విధించింది. యథాతథ స్థితి కొనసాగించాలని ఆదేశాలు జారీ చేసింది. తమ వాదనలు వినకుండానే సర్వే ఆదేశాలు ఇచ్చారని టీజీఐఐసీ వాదనలు వినిపించింది.

అయితే, హైకోర్టులో ఇంప్లీడ్ అయ్యేందుకు సుప్రీంకోర్టు అనుమతిచ్చింది. ఆగస్టు 14వ తేదీ వరకు టీజీఐఐసీకి గడువు విధించింది. ఆ లోగా హైకోర్టులో సవరణ దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేసింది. రాయదుర్గం సర్వే నంబర్ -83/2లోని 46 ఎకరాల భూమిని వేలం వేసే ప్రతిపాదన లేదని సుప్రీంకోర్టుకు టీజీఐఐసీ సీనియర్ న్యాయవాది తెలిపారు.

## తెలంగాణ కోసం కడవరకు తపించిన
# జయశంకర్ సార్

**కేసీఆర్ పట్టుదలపై నమ్మకంతో వెన్నంటి వచ్చారు**

**జయంతి సభలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**




హైదరాబాద్, ఆగస్ట్ 6 : తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గురువారం తెలంగాణ భవన్‌లో ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కేసీఆర్‌కు మించి దక్షత, కమిట్‌మెంట్, తెలంగాణ సాధించాలనే

## సైబర్ నేరాల నియంత్రణలో
# తెలంగాణ ప్రథమ స్థానం

### కేంద్ర హోంశాఖ ప్రకటన

న్యూఢిల్లీ, ఆగస్ట్ 6 : సైబర్ నేరాల నియంత్రణలో దేశంలోనే తెలంగాణ ప్రథమ స్థానంలో నిలిచింది. రాష్ట్రాల సైబర్ సెక్యూరిటీ బ్యూరో పనితీరును పరిశీలించిన కేంద్ర హోంశాఖ ఈ మేరకు ప్రకటన విడుదల చేసింది. కేంద్ర హోంశాఖ నిర్దేశిరచిన 9 ప్రామాణికాల ఆధారంగా తెలంగాణ తొలి స్థానంలో నిలిచినట్లు పేర్కొంది. సైబర్ కమాండ్ ఏర్పాటు, ఈ-జీరో ఎఫ్ఐఆర్ అమలు, గ్రీవెన్స్ రీడ్రెసెల్ మాడ్యూల్, రిఫండ్ కోసం మనీ రీస్టోరేషన్ మాడ్యూల్, సహయోగ్ పోర్టల్, సమన్వయ పోర్టల్ వినియోగ గణాంకాలు, సైబర్ క్రైమ్ హాట్ స్పాట్‌లపై నిఘా వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంది.




## సింగరేణి చరిత్రలో
# మరో మైలురాయి

**నైనీ గనుల నుంచి థర్మల్ విద్యుత్ కేంద్రానికి బొగ్గురాక**

**రజైపూర్ వద్ద రైలుకు స్వాగతం పలికిన అధికారులు**

**బొగ్గు రాకపై డిప్యూటి సిఎం భట్టి ఆనందం**

సింగరేణి చరిత్రలో మరో మైలురాయి చేరింది. ఒడిశాలోని సింగరేణి నైనీ గని నుంచి తొలి బొగ్గు రైల్వే వ్యాగన్ తెలంగాణకు చేరింది. మంచిర్యాల జిల్లా జైపుర్ సింగరేణి థర్మల్ విద్యుత్తు కేంద్రానికి బొగ్గు రైలు చేరుకుంది. సింగరేణి అధికారులు రైలుకు ఘన స్వాగతం పలికారు. 59 వ్యాగన్ల ద్వారా 4 వేల టన్నుల జీ-10 గ్రేడ్ బొగ్గు వచ్చింది. ఈసందర్భంగా సింగరేణి యాజమాన్యం, కార్మికులకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శుభాకాంక్షలు తెలిపారు.



మంచిర్యాల, ఆగస్ట్ 6 : సింగరేణి చరిత్రలో అద్భుత ఘట్టం ఆవిష్కృతమైందన్నారు. మంచిర్యాల జిల్లా జైపూర్‌లోని సింగరేణి థర్మల్ పవర్ ప్రాజెక్ట్ కి ఒడిశాలోని నైనీ బ్లాక్ నుంచి బొగ్గు చేరుకుంది. ఈ పరిణామపం పట్ల తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హర్షం వ్యక్తం చేశారు. ఇది చారిత్రాత్మక ఘట్టమని అభివర్ణించారు. గురువారం ఈ థర్మల్ పవర్ ప్రాజెక్టుకు నైనీ బ్లాక్ నుంచి బొగ్గు లోడ్‌తో రైల్వే వ్యాగన్ వచ్చింది. ఈ నేపథ్యంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పందించారు. రాష్ట్రంలో విద్యుత్ లోటు లేకుండా

-మిగతా 2 లో..



## గోదావరి ప్రాజెక్టులకు
# సమాధి

## సచివాలయం ప్రాంగణంలో
# ఘనంగా బోనాల ఉత్సవాలు

**ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి**

హైదరాబాద్: డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో గురువారం సచివాలయ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ వేడుకల్లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ సంజయ్ జాజు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సచివాలయ ఆవరణలోని శ్రీ నల్ల పోచమ్మ అమ్మవారి ఆలయంలో నిర్వహించిన పూజల్లో ప్రధాన కార్యదర్శి పాల్గొని రాష్ట్ర ప్రజలు సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలతో వర్ధిల్లాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగులు సంప్రదాయబద్ధంగా బోనాలను సమర్పించగా, పోతరాజుల విన్యాసాలు, డప్పుల వాయిద్యాలు, వివిధ వేషధారణలతో కళాకారుల ప్రదర్శనలు ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.





## 1.05 కోట్ల కొత్త ల్యామినేటెడ్
# రేషన్ కార్డులు

**అర్హులకు ఆహార భద్రతను విస్తరించడమే లక్ష్యం**

**పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి**

హైదరాబాద్, ఆగస్ట్ 6 : తెలంగాణలో నూతన పీడీఎస్ రేషన్ కార్డుల పంపిణీకి ప్రభుత్వం తుది ముహూర్తం ఖరారు చేసింది. ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా నూతన రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియను ప్రారంభించనున్నట్లు పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. అర్హులకు ఆహార భద్రతను విస్తరించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ బృహత్తర కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 1.05 కోట్ల కొత్త, ల్యామినేటెడ్ రేషన్ కార్డులను అర్హులకు అందించనున్నారు. సంగారెడ్డి జిల్లాలో

-మిగతా 2 లో..

## జొన్న రైతులకు
# శుభవార్త

**రూ. 994 కోట్ల బకాయిలు జమ**

**మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**



హైదరాబాద్,ఆగస్ట్6 : తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో రాష్ట్ర రైతాంగానికి తీపి కబురు అందించారు. జొన్న పంట కొనుగోళ్లకు సంబంధించి రైతులకు చెల్లించాల్సిన రూ. 994 కోట్లను నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు ప్రకటించారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ధాన్యం, పంటల కొనుగోలు విధానం వేగవంతంగా, పారదర్శకంగా సాగుతోందని, ఇది మొత్తం దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఆయన వ్యాఖ్యానించారు. అలాగే రాష్ట్రంలో

-మిగతా 2 లో..



## నీట్‌లో పెన్, పేపర్ విధానానికి స్వస్తి

**నందన్ నీలేకన్ నేతృత్వంలో కమిటీ ఏర్పాటు**

**సుప్రీంకోర్టుకు కేంద్రం అఫిడవిట్ దాఖలు**



# జెన్‌జీ నిరసన
## దేశ వ్యతిరేకం కాదు

ముంబయి: నవతరం (జెన్ జీ) మనోవేదన నిజమైనదేనని, వారి ఆందోళనలో నిజాయితీ ఉందని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) చీఫ్ మోహన్ భాగవత్ కితాబిచ్చారు. నిరసన తెలిపేందుకు, అధికారాన్ని ప్రశ్నించేందుకు, సంస్కరణలు కోరేందుకు విద్యార్థులకు హక్కు ఉందన్నారు. జెన్‌జీ నిరసనలు నిర్వహించకూడదని తాను ఎన్నటికీ అనబోనని స్పష్టంచేశారు. వారి ఉద్యమాన్ని దేశ వ్యతిరేక కార్యకలాపంగా ముద్రవేయడం సరికాదని హెచ్చరించారు. జంతర్ మంతర్‌లో పోలీసులకు, నిరసనకారులకు మధ్య వివాదం ఏ విధంగా తలెత్తిందో కానీ యువతరంపై తన విశ్వాసం

అచంచలమైనదని భాగవత్ స్పష్టం చేశారు. గురువారం ఇండియాస్ ఇంటర్నేషనల్ మూవ్‌మెంట్ టు యునైట్ నేషన్స్ (ఐఐఎంయూఎన్) సంస్థ 15వ వార్షికోత్సవ సభలో పాల్గొని ప్రసంగించారు.



# ప్రధాని విదేశీ టూర్ల వ్యయం 550 కోట్లు..

(మొదటిపేజీ తరువాయి)

ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాల్లో ప్రధాని మోదీ పర్యటించారు. విదేశీ పర్యటనల కోసం గతేడాది (2025లో) రూ.187 కోట్లు, 2024లో రూ.109 కోట్లు, 2023లో రూ.93 కోట్లు, 2022లో రూ.55 కోట్లు, 2021లో రూ.36 కోట్లు ఖర్చయినట్లు కేంద్రం వెల్లడించింది. గతేడాది (2025) మొత్తంగా 23 దేశాల్లో పర్యటించారు. ఫ్రాన్స్ (రూ.25 కోట్లు), అమెరికా (రూ.16 కోట్లు), సౌదీ అరేబియా (రూ.15 కోట్లు), బ్రెజిల్ (రూ.17 కోట్లు), చైనా (రూ.10 కోట్లు), బ్రిటన్ (రూ.9 కోట్లు) తదితర దేశాల్లో ప్రధాని మోదీ అధికారిక పర్యటనలు చేశారు. మారిషస్, థాయ్‌లాండ్, శ్రీలంక, సైప్రస్, కెనడా, క్రొయేషియా, ఘనా, ట్రినిడాడ్ అండ్ టొబాగో, అర్జెంటీనా, నమీబియా, మాల్దీవులు, జపాన్, భూటాన్, దక్షిణాఫ్రికా, జోర్డాన్, ఒమన్, ఇథియోపియా దేశాల్లోనూ ప్రధాని మోదీ పర్యటించారు. వివిధ దేశాలతో సన్నిహిత సంబంధాలను పెంపొందించడానికి.. ద్వైపాక్షిక, ప్రాంతీయ, అంతర్జాతీయ స్థాయిలో దేశ భాగస్వామ్యాన్ని మరింత మెరుగుపరిచేందుకు ప్రధానమంత్రి అత్యున్నత స్థాయి పర్యటనలు దోహదం చేస్తాయని విదేశాంగ శాఖ పేర్కొంది. ఈ పర్యటనల (ఏప్రిల్ 2021- డిసెంబర్ 2025 మధ్య) సందర్భంగా చేసుకున్న అవగాహన ఒప్పందాల్లో భాగంగా సుమారు 381 బిలియన్ డాలర్ల (రూ.30 లక్షల కోట్ల కన్నా ఎక్కువ) విలువైన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు వచ్చినట్లు తెలిపింది.

# ఔటర్ రింగ్ రోడ్డు నిర్వహణలో గుత్తేదారు నిర్లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

వ్యవస్థ ఉండాలి. ఓఆర్ఆర్‌పై ఎక్కడపడితే అక్కడ వాహనాలను నిలపడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఔటర్ రింగ్ రోడ్డు గుత్తేదారు నిర్లక్ష్యంగా ఉన్నాడు. ఓఆర్ఆర్ నిర్వహణను ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షణ చేయాలి. ప్రభుత్వం సేకరించిన భూములకు మాత్రమే టీడీఆర్ అమలు చేయాలి. ఈ ప్రక్రియను మొత్తం ఆన్‌లైన్ చేయాలి. రేడియల్ రోడ్ల నిర్మాణం వేగవంతం చేయాలి. కొంగరకలాన్ - ఫ్యూచర్‌సిటీ రేడియల్ రోడ్డు డిసెంబర్ 9లోపు పూర్తి చేయాలి. ల్యాండ్ పూలింగ్‌లో మధ్యవర్తుల జోక్యాన్ని సహించవద్దు" అని అన్నారు. సమావేశంలో హైదరాబాద్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.



# 1.05 కోట్ల కొత్త ల్యామినేటెడ్ రేషన్ కార్డులు

(మొదటిపేజీ తరువాయి)

ముఖ్యమంత్రి స్వయంగా ఈ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనుండగా, అదే సమయంలో రాష్ట్రంలోని అన్ని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏకకాలంలో పంపిణీ పక్రియ మొదలవుతుంది. స్వాతంత్ర్య దినోత్సవం రోజున మధ్యాహ్నం 2:00 గంటల నుండి సాయంత్రం 4:00 గంటల వరకు ఈ పంపిణీ కార్యక్రమాలు సాగుతాయి. కార్యక్రమం సజావుగా సాగేందుకు ప్రతి నియోజకవర్గంలో పంపిణీ పర్యవేక్షణ బాధ్యతలను ప్రభుత్వం ఆర్డీవోలకు అప్పగించింది. స్థానిక ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో ఈ వేడుకలు జరగనున్నాయి. కార్డుల సేకరణకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వేదికల వద్ద మౌలిక వసతులు, తాగునీరు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. పంపిణీ పూర్తయిన వెంటనే సమగ్ర నివేదికను ప్రభుత్వానికి సమర్పించాలని స్పష్టమైన సూచనలు జారీ చేశారు.




# నీట్‌లో పెన్, పేపర్ విధానానికి స్వస్తి

- నందన్ నీలేకన్ నేతృత్వంలో కమిటీ ఏర్పాటు
- సుప్రీంకోర్టుకు కేంద్రం అఫిడవిట్ దాఖలు

**న్యూఢిల్లీ,ఆగస్ట్6 :** నీట్ యూజీ పరీక్షలో పెన్ అండ్ పేపర్ విధానానికి స్వస్తి చెబుతామని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. జేఈఈ తరహాలో కంప్యూటర్ ఆధారిత విధానంలో పరీక్ష (ాఅశ్రీఅవ జుఇఖఎ) నిర్వహించేందుకు కసరత్తు చేస్తున్నట్లు తెలిపింది. నందన్ నీలేకని నేతృత్వంలోని హైపవర్ టాస్క్‌ఫోర్స్ సిఫార్సుల మేరకు తుది నిర్ణయం తీసుకుంటామని పేర్కొంటూ సుప్రీం కోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. నీట్-యూజీ నిర్వహణపై దాఖలైన పిటిషన్లపై విచారణ జరిపిన సుప్రీం ధర్మాసనం.. తదుపరి విచారణను ఈ నెల 19వ తేదీకి వాయిదా వేసింది. పేపర్ లీక్‌లు, వ్యవస్థాగత వైఫల్యాలను తొలగించేందుకు నీట్ (చీజుజు) నిర్వహణలో సమగ్ర మార్పులు చేపట్టినట్లు ప్రభుత్వం తెలిపింది. ఇటీవల పరీక్షలో చోటుచేసుకున్న అక్రమాలపై విచారణ కొనసాగుతుందని స్పష్టం చేసింది. మరోవైపు, ఒకవేళ పరీక్షను కంప్యూటర్ విధానంలోకి మారిస్తే.. ఆ విషయంపై ముందే స్పష్టత ఇవ్వాలని వైద్యుల సంఘం కోరింది. కేంద్రం దాఖలు చేసిన అఫిడవిట్‌పై స్పందనను తెలియజేయాలని వైద్యుల సంఘంతోపాటు సంబంధిత పిటిషనర్లకు సుప్రీం కోర్టు సూచించింది.

# డిజిటల్ చెల్లింపులపై బాదుడు

(మొదటిపేజీ తరువాయి)

ప్రాసెసర్లు చాన్నాళ్లుగా గగ్గోలు పెడుతున్న నేపథ్యంలో కేంద్రం ఆ మేరకు చర్యలు చేపట్టింది. అందరినీ డిజిటల్ చెల్లింపుల వైపు మళ్లించే లక్ష్యంతో ముందుగా యూపీఐ ఉచితమనే తాయిలం చూపించిన ప్రభుత్వం..దాదాపుగా దేశమంతా దానికి అలవాటు పడ్డాక ప్లేటు ఫిరాయించిందని, యూపీఐని కూడా ఆదాయ వనరుగా మార్చుకునేందుకు ప్రయత్నిస్తోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ చర్యల వల్ల మళ్లీ ప్రజలు నగదు లావాదేవీల వైపు మళ్లే పరిస్థితి తలెత్తుతుందని.. ఏటీఎంలు, బ్యాంకుల వద్ద గతంలోలా క్యూ లైన్లు కనిపించినా ఆశ్చర్యం లేదని విశ్లేషకులు అంటున్నారు. ప్రస్తుతం చెల్లింపుల సంబంధ ఆర్థిక లావాదేవీల కోసం ప్రాథమికంగా బ్యాంకులు, పేమెంట్ ప్రాసెసర్ల నెట్‌వర్క్‌లను ఉపయోగించుకున్నందుకు గాను వ్యాపార వర్గాలు ఆయా సంస్థలకు చెల్లించాల్సిన చార్జీలను మర్చంట్ డిస్కౌంట్ రేటు (ఎండీఆర్)గా వ్యవహరిస్తున్నారు. ఇందులో ఇంటర్‌చేంజ్ ఫీజు, ప్రాసెసింగ్ చార్జీలు, నెట్‌వర్క్ ఫీజులు, పన్నుల్లాంటివి ఉంటాయి. క్రెడిట్, డెబిట్ కార్డులను జారీ చేసే బ్యాంకులకు చెల్లించేది ఇంటర్‌చేంజ్ ఫీజు, రేజర్‌పే, పేయూలాంటి పేమెంట్ ప్రాసెసర్ లేదా గేట్‌వేలకు కట్టేవి ప్రాసెసింగ్ చార్జీలు. వీసా, మాస్టర్‌కార్డ్ ఎన్‌పీసీఐలాంటి పేమెంట్ నెట్‌వర్క్‌లకు వెళ్లేది నెట్‌వర్క్ ఫీజు. అంతిమంగా ఈ సర్వీసులపై జీఎస్‌టీ కింద ప్రభుత్వానికి ట్యాక్సులు వెళ్తాయి. అయితే దేశీయ పేమెంట్ గేట్‌వేని, డిజిటల్ చెల్లింపుల విధానాన్ని ప్రోత్సహించే ఉద్దేశంతో 2020 నుంచి యూపీఐ, రూపే డెబిట్ కార్డు లావాదేవీలపై ఎలాంటి ఎండీఆర్ అయినా జీరో చేస్తూ కేంద్రం చట్టం చేసింది. ఈ నేపథ్యంలో రూపే, యూపీఐ మినహా ఇతర వ్యవస్థల్లో యథావిధిగా 0.4 శాతం నుంచి 4.5 శాతం వరకు (కార్డును బట్టి) ఎండీఆర్ చార్జీలు కొనసాగుతున్నాయి. కాగా తాజా చట్ట సవరణలో యూపీఐ, రూపే




డెబిట్ కార్డు లావాదేవీలపై 'ఎండీఆర్ జీరో'ను తొలగించి దీనిపై నిర్ణయాధికారాన్ని ప్రభుత్వానికి కట్టబెట్టారు. ప్రభుత్వం ఇకపై ఎప్పటికప్పుడు విడుదల చేసే నోటిఫికేషన్ల ద్వారా యూపీఐ, రూపే లావాదేవీలకు సంబంధించిన చార్జీలను నిర్ణయించనుంది. యూపీఐ లావాదేవీల వ్యయాల భారంలో కొంత భాగాన్ని బ్యాంకులు, పేమెంట్ ప్రాసెసర్లు భరిస్తుండగా, మిగతాదంతా ప్రభుత్వం సబ్సిడీగా ఇస్తోందని, ఇదంతా పన్ను చెల్లింపుదారుల సొమ్మేనని నిపుణులు చెబుతున్నారు. ఈ భారం ఏటా దాదాపు రూ. 20 వేల కోట్లు ఉంటుందని అంచనా. వాస్తవానికి తక్కువ విలువ చేసే లావాదేవీలను ప్రోత్సహించే ఉద్దేశంతో రూ.2 వేల లోపు విలువ ఉండే లావాదేవీలపై బ్యాంకులకు సబ్సిడీ ఇచ్చేలా 2021 డిసెంబర్‌లో ప్రభుత్వం స్కీమును ప్రవేశపెట్టింది. 2021--22లో ఇలా రూ.1,389 కోట్ల సబ్సిడీ ఇవ్వగా, 2023--24 నాటికి ఇది ఏకంగా రూ.3,631 కోట్లకు పెరిగింది. దీంతో క్రమంగా ఈ భారాన్ని తగ్గించుకోవడంపై ప్రభుత్వం దృష్టి పెడుతోంది. 2026--27 బడ్జెట్‌లో ఇందుకోసం రూ.2 వేల కోట్లు మాత్రమే కేటాయించడం ఇందుకు నిదర్శనమని విశ్లేషకులు చెబుతున్నారు. ఇక ఇతరత్రా ఎలక్ట్రానిక్ పేమెంట్స్ విధానాల్లో ఎండీఆర్ చార్జీలను పరిస్థితులను బట్టి కొందరు వ్యాపారులు తామే చెల్లిస్తుండగా మరికొందరు ఆ భారాన్ని కస్టమర్లకే బదలాయిస్తున్నారు. యూపీఐ పేమెంట్లపై చార్జీల వడ్డనకు రంగం సిద్ధమవుతున్నప్పటికీ, అన్ని చెల్లింపులపైనా చార్జీల భారం పడకపోవచ్చని పరిశ్రమ వర్గాలు అంటున్నాయి. రూ.2 వరకు చెల్లింపులపై మినహాయింపు ఉండొచ్చని చెబుతున్నాయి. రూ.50 కోట్ల పైబడి టర్నోవర్ ఉండే పెద్ద వ్యాపారులకు సంబంధించిన యూపీఐ లావాదేవీలపై 0.3--0.6 శాతం వరకు చార్జీలు విధించవచ్చని పేర్కొన్నాయి. ప్రస్తుతం చిన్న వ్యాపారులకు చేసే రూ.2 వేల వరకు మొత్తాలకు మాత్రమే ప్రభుత్వం ఇన్సెంటివ్ స్కీము కింద సబ్సిడీనిస్తోంది. ఆర్థిక శాఖ డేటా ప్రకారం 2026 ఆర్థిక సంవత్సరంలో వ్యాపారులకు కస్టమర్లు చెల్లించిన రూ.2 వేలకు పైబడిన లావాదేవీల పరిమాణం కేవలం 4 శాతంగానే ఉంది. లోకల్ సర్కిల్స్ అనే ఆన్‌లైన్ ప్లాట్‌ఫాం ఇటీవల నిర్వహించిన సర్వే ప్రకారం రూ.3 వేలకు పైబడే యూపీఐ పేమెంట్ల మీద చార్జీలను కస్టమర్ల నుంచే వ్యాపారులు వసూలు చేస్తే తాము యూపీఐని వాడటం మానేస్తామంటూ దాదాపు 98 శాతం మంది చెప్పారట. అయితే ప్రస్తుతానికి ఇవన్నీ ఊహాగానాలేనని, వాస్తవ చార్జీలు.. భవిష్యత్తులో చట్ట సవరణ పూర్తిస్థాయిలో ఆమోదం పొందిన తర్వాత ప్రభుత్వం విడుదల చేసే నోటిఫికేషన్ ద్వారా మాత్రమే వెల్లడవుతాయని బ్యాంకర్లు చెబుతున్నారు.

# సింగరేణి చరిత్రలో మరో మైలురాయి

(మొదటిపేజీ తరువాయి)

చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. సింగరేణి థర్మల్ పవర్ ప్రాజెక్ట్‌కు తమ ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు. దేశ అవసరాలకూ సింగరేణి బొగ్గు కీలకమని గుర్తు చేశారు. కొత్త కోల్ బ్లాకుల కోసం ప్రయత్నాలు కొనసాగుతాయని తెలిపారు. సింగరేణిని కాపాడుకుంటామని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు. నైనీ గనుల నుంచి బొగ్గు రాకతో సింగరేణి థర్మల్ పవర్ ప్రాజెక్ట్‌కు ఆ కొరత తీరిందని వివరించారు. సింగరేణి థర్మల్ పవర్ ప్రాజెక్ట్ కి రైలు వ్యాగిన్ చేరుకోగానే.. ఉన్నతాధికారులు స్వాగతం పలికారు. 9 బాక్స్ వ్యాగన్లలో మొత్తం 4,000 టన్నుల జీ-10 రకం బొగ్గు ఒడిశాలోని నైనీ గని నుంచి గురువారం ఉదయం జైపూర్‌కు చేరుకుంది. సింగరేణి కాలరీస్ నుంచి 136 ఏళ్ల చరిత్రలో తొలిసారిగా రాష్ట్రం వెలుపల ఉన్న గని నుంచి బొగ్గు ఉత్పత్తిని సాధించి సొంత థర్మల్ ప్లాంట్‌కు రవాణా చేయడం ఇదే తొలిసారి. ఈ ప్రాజెక్టు విజయవంతం కావడం వెనుక రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అలుపెరగని కృషి, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ ఉన్నాయని ప్రభుత్వం తెలిపింది. అనుమతుల సాధనలో ఎదురైన ఎన్నో అడ్డంకులను పటాపంచలు చేస్తూ ఈ విజయాన్ని సొంతం చేసుకున్నారని పేర్కొంది. అనుమతుల కోసం భట్టి విక్రమార్క స్వయంగా రెండుసార్లు ఒడిశా పర్యటనకు వెళ్లిన విషయం తెలిసిందే. 2024 జులైలో ఒడిశా ముఖ్యమంత్రి, ఉన్నతాధికారులతో సానుకూల వాతావరణంలో చర్చలు జరిపి, ఆటంకాలన్నీ తొలగించారని సర్కార్ స్పష్టం చేసింది. అనంతరం 2025 ఏప్రిల్ 16న నైనీ గనిలో బొగ్గు



ఉత్పత్తిని వర్చువల్ విధానంలో డిప్యూటీ సీఎం ప్రారంభించారు. ఆ శ్రమ ఫలితంగా నైనీ గని నుంచి బయలుదేరిన తొలి రైలు 1,131 కిలోమీటర్లు ప్రయాణించి తెలంగాణ గడ్డపైకి చేరుకుంది. 59 బాక్స్ వ్యాగన్ల ద్వారా ఏకంగా 4 వేల టన్నుల అత్యుత్తమ జీ-10 గ్రేడ్ నాణ్యమైన బొగ్గు సింగరేణి థర్మల్ కేంద్రానికి చేరింది. కేంద్ర బొగ్గు శాఖ 2015 ఆగస్టు 13న సింగరేణికి కేటాయించిన ఈ నైనీ గని, మొత్తం 340.78 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వల సామర్థ్యాన్ని కలిగి ఉంది. ఈ గని జీవితకాలం 36 సంవత్సరాలు కాగా, ఏడాదికి కోటి టన్నుల (10 మిలియన్ టన్నులు) ఉత్పత్తి సామర్థ్యంతో నడవనుంది. నైనీ నుంచి నాణ్యమైన బొగ్గు రాకతో తెలంగాణ విద్యుత్ ఉత్పత్తిలో ఇకపై ఎలాంటి ఆటంకాలు ఉండవని, భవిష్యత్తు తరాలకు నిరంతర ఉచిత, నాణ్యమైన విద్యుత్ అందించాలన్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని స్పష్టమవుతోంది. సింగరేణి కీర్తి కిరీటంలో ఈ నైనీ బొగ్గు గని మరో వజ్రంగా నిలిచిపోనుంది.

# తెలంగాణ కోసం కడవరకు తపించిన జయశంకర్ సార్

(మొదటిపేజీ తరువాయి)

మొండితనం ఉన్న నాయకుడిని ఒక్కరిని చూపించండి.. నేను మీ వెంబడి నడుస్తా అని అనేవారని, ఆయన మొహమాటం కూడా పడేది కాదని గుర్తు చేసుకున్నారు. దేవేందర్ గౌడ్ పార్టీ పెడితే వెళ్లి మీరు పోవొద్దు సార్ కేసీఆర్‌తో అసోసియేట్ అయి ఉన్నరని అంటే జయశంకర్ సార్ ఒక మాట చెప్పిండు.. ఎన్ని పార్టీలు వస్తే అంత మంచిది ఏం కాదు.. తెలంగాణ రాష్ట్రం రావాలే.. ఆ రాష్ట్రం వచ్చే క్రమంలో నేను వాళ్లకు తెలంగాణ కోసం స్పర్థ లేకుండా, సమాంతరంగా పనిచేయండి.. ఒకరికి ఒకరు కలహించుకోకండి.. ఎవరు చేసిన అల్టిమేట్‌గా మీరందరూ కోరుతున్నది తెలంగాణెలి కదా..చెప్పి వస్తనన్నారు. తెలంగాణ ఉద్యమం సమయంలో ఎన్ని కొత్త పార్టీలు పుట్టినా, వారికి తాత్కాలిక భావసారూప్యత లేకపోయినా, లక్ష్యసారూప్యత ఉండాలని బలంగా వాదించిన గొప్ప వ్యక్తి ప్రొఫెసర్ జయశంకర్ సార్ అని కేటీఆర్ అన్నారు. తెలంగాణలో మళ్లీ నీళ్లకు అన్యాయం చేసే ప్రయత్నం జరుగు తుందని కేటీఆర్ తెలిపారు. తెలంగాణకు సంబంధించిన 7 ప్రాజెక్టులను రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఏపీ ప్రభుత్వం అడుగుతుంది. ఢిల్లీ పార్టీ చేతుల్లో జుట్టు ఉంటే వాళ్లు ఆడించినట్లే ఆడాలి. అదే తెలంగాణ కోసం పుట్టిన పార్టీ అధికారంలో ఉంటే ఆ పరిస్థితి ఉంటుందా..? అని కేటీఆర్ అడిగారు. లోక్‌సభలో తెలంగాణ విభజనను పాకిస్తాన్‌తో పోలిస్తే ఒక్క బీజేపీ, కాంగ్రెస్ ఎంపీ అయినా మాట్లాడిండా..? అదే మనవాడు ఉంటే గల్లా పట్టి అడిగేవాడని అన్నారు.



రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత 75వ సారి ఇవాళ ఆయన ఢిల్లీలో ఉన్నడు. ముఖ్యమంత్రి అయి 32 నెలలు కూడా కాలేదు.. రేపటితోనో, ఎల్లుండితోనో అవుతయి. కానీ 13 రోజులకోసారి ఢిల్లీ పోతడు.. 2,3 రోజులు అక్కడుంటడు. దేహి దేహీ అని ఈ రోజు అక్కడ యాచిస్తున్న డు. అందుకే జయశంకర్ సార్ ఢిల్లీకి సామంతులుగా ఉండొద్దు.. స్వతంత్రులుగా ఉండాలే అని కోరుకున్నరని అన్నారు. ఎన్నటికైనా స్వీయ రాజకీయ అస్థిత్వమే తెలంగాణకు శ్రీరామ రక్ష. తెలంగాణ కోసం ఒక స్వీయ రాజకీయ అస్థిత్వ పతాక ఉండాలే. ఎన్నటికైనా తెలంగాణ కోసం ఎలాంటి రాజీ లేకుండా ఎవరితో కాంప్రమైజ్ కాకుండా గొంతు విప్పితే ఒక సింహం లాగా గర్జించే విధంగా కేసీఆర్ తీరుగా గొంతు ఉండాలే.. అందుకే కాంగ్రెస్‌లో కలవొద్దు అని గట్టిగా వాదించిన నాయకుడు, మహానుభావుడు ప్రొఫెసర్ జయశంకర్ సార్ అని కేటీఆర్ అన్నారు.

# నల్లమలలో రెండు పులుల మృతి

## ఒకటి వేటగాళ్ల తూటాలకు బలి

## ఏడుగురు నిందితుల అరెస్ట్

**అమరావతి,ఆగస్ట్6 :** నల్లమల అటవీ ప్రాంతంలో ఇటీవల మృతిచెందిన రెండు పులులలో ఒకదాన్ని వేటగాళ్లు చంపినట్లు అటవీశాఖ సలహాదారు, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి కమిటీ ఛైర్మన్ మల్లికార్జునరావు తెలిపారు. గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో పులుల మృతిపై ఆయన వివరణ ఇచ్చారు. నల్లమల అడవుల్లో రెండు పులులు మరణించాయి. ఆత్మకూరు రీజియన్‌లో ఒకటి, గిద్దలూరు అటవీ ప్రాంతంలో మరొకటి మృతిచెందాయి. గిద్దలూరులో పులిని వేటగాళ్లు చంపారు. తుపాకీతో కాల్చడంతో బుల్లెట్ తగిలి మరణించింది. పులి మృతిచెందిన తర్వాత దాని గోళ్లు తీసుకెళ్లారు. ఈ ఘటనలో ఏడుగురు నిందితులను అరెస్ట్ చేశాం. వారి నుంచి పులిగోళ్లు స్వాధీనం చేసుకున్నాం. ఆత్మకూరు రీజియన్‌లో చనిపోయిన పులిది సహజ మరణమే. ముళ్లపందిని తినబోయి.. దాని ముల్లు గుచ్చుకోవడంతో చనిపోయిందని మల్లికార్జునరావు వివరించారు.



# జొన్న రైతులకు శుభవార్త

(మొదటిపేజీ తరువాయి)

ఎరువుల పంపిణీని మరింత పారదర్శకం చేసేందుకు రూపొందించిన 'తెలంగాణ ఎరువుల యాప్' విజయవంతం కావడంతో, దాని ప్రమాణాల ఆధారంగానే కేంద్ర ప్రభుత్వం 'ఫెర్టిలైజర్ ఫీల్డ్ స్టాఫ్' (ఈఈఃూ) వ్యవస్థను అందుబాటులోకి తెచ్చిందని మంత్రి స్పష్టం చేశారు. ఈ నూతన ఎరువుల పంపిణీ విధానాన్ని నేటి నుంచి మరో 10 జిల్లాలకు విస్తరిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో సంప్రదాయ పంటలతో పాటు వాణిజ్య పంటలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా ఆయిల్ పామ్ సాగు విస్తరణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, రైతులకు అవసరమైన ప్రోత్సాహకాలు, అవగాహన అందించాలని ఆదేశించారు. తెలంగాణను ఆయిల్ పామ్ ఉత్పత్తిలో అగ్రగామిగా నిలపడమే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పారు. ఇదే సమావేశంలో చేనేత రంగానికి సరికొత్త సాంకేతికతను జోడించేలా నిర్వహించిన హ్యాండ్లూమ్ హ్యాకథాన్ లో విజేతగా నిలిచిన ప్రతిభావంతులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేకంగా అభినందించి, ఘనంగా సన్మానించారు. చేనేత కార్మికుల నైపుణ్యానికి సాంకేతికత తోడైతే మార్కెటింగ్ రంగంలో అద్భుతాలు సృష్టించవచ్చని పేర్కొన్నారు. అన్నదాతల సంక్షేమం, వ్యవసాయ రంగం బలోపేతమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో గాయపడి బ్రెయిన్ డెడ్

## అవయవాలను దానం చేసిన కుటుంబ సభ్యులు

**మెదక్,ఆగస్ట్6 :** రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి బ్రెయిన్ డెడ్ కావడంతో అతని అవయవాలు మరో నలుగురికి ప్రాణాధారంగా మారాయి. పెద్ద శంకరంపేటకు చెందిన తోట రవీందర్ మండల పరిధిలోని మల్కాపూర్‌లో ఆర్ఎంపీగా విధులు నిర్వహిస్తూ అందరి మన్నలను పొందాడు. ఈ నెల రెండవ తేదీన ఆదివారం పెద్ద శంకరంపేట పట్టణ శివారులో తోట రవీందర్ రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. గురుపాదుగుట్ట వద్ద అతడు నడుపుతున్న బైకును ఎదురుగా వస్తున్న బైకు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతడిని చికిత్స కోసం హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. అయితే, అతనికి బ్రెయిన్ డెడ్ కావడంతో బతికే అవకాశం లేదని, అతని అవయవాలు దానం చేస్తే మరికొందరికి నూతన జీవితం లభిస్తుందని జీవన్‌దాన్ ఆర్గాన్ డొనేషన్ నిపుణులు, వైద్యులు అతడి తల్లిదండ్రులకు, కుటుంబ సభ్యులకు వివరించారు. వైద్యుల సూచన మేరకు.. తన కుమారుడు భౌతిక రూపంలో లేకపోయినా మరో రూపంలో జీవించి ఉంటాడని ఆశతో అతడి కుటుంబ సభ్యులు అవయవ దానానికి అంగీకరించారు. వైద్య నిపుణులైన బృందం అతని గుండె, కాలేయం, కిడ్నీలు, నేత్రాలను సేకరించారు. అనంతరం రవీందర్ భౌతిక కాయాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. పెద్ద శంకరంపేటలో గురువారం అతడి అంత్యక్రియలు నిర్వహించారు. రవీందర్ భౌతిక కాయానికి నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు. తల్లిదండ్రులకు, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. రవీందర్ భౌతికకాయాన్ని చూడడానికి పెద్ద శంకరంపేట పట్టణంతోపాటు మల్కాపూర్‌తోపాటు ఇతర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో యువకులు, మహిళలు, బంధువులు తరలివచ్చారు.

# జయశంకర్ సార్‌కు ఎంపిల నివాళి

**హైదరాబాద్,ఆగస్ట్6 :** తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ 93వ జయంతి సందర్భంగా రాజ్యసభ బీఆర్ఎస్ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, దామోదర్ రావు, అమర్ రావు ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్‌కు తోడుగా నిలిచి తెలంగాణ కోసం పోరాడారు జయశంకర్ సార్ అని అన్నారు. ?ప్రజల స్వాభిమానం, సమాన హక్కులు, సామాజిక న్యాయం కోసం జయశంకర్ సార్ నిరంతరం శ్రమించారని పేర్కొన్నారు.? సార్ ?తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం చేసిన సేవలు అమూల్యం అని వెల్లడించారు. మలిదశ ఉద్యమ సమయంలో తెలంగాణ కోసం పోరాడిన సార్ 2011లో ప్రత్యేక రాష్ట్రం రాకముందే కన్నుమూయడం బాధాకరమని పేర్కొన్నారు.

వేగుచుక్క

# ఆచార్య జయశంకర్ ఆశయాల సాధనకు కృషి చేయాలి

## - జయంతి వేడుకలో కలెక్టర్ భవేష్ మిశ్రా



**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, ఆగస్టు 06 :**

తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య జయశంకర్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ భవేష్ మిశ్రా సూచించారు. ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని పురస్కరించుకుని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ప్రధాన సమావేశ మందిరంలో గురువారం జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ భవేష్ మిశ్రా ముఖ్య అతిథిగా విచ్చేసి, ఆచార్య జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆచార్య జయశంకర్ అందించిన సేవలను కొనియాడారు. తెలంగాణ భావజాలాన్ని ఎంతో గొప్పగా ముందుకు తీసుకెళ్లిన మహనీయుడని ప్రశంసించారు. 1969 ఉద్యమంతో పాటు మలి విడత ఉద్యమం లోనూ ప్రజలను ప్రత్యేకించి విద్యార్థులు, యువతను ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో భాగస్వామ్యం చేశారని గుర్తు చేశారు. ప్రత్యేక రాష్ట్ర సాధనే ఆశ, శ్వాసగా ఆరు దశాబ్దాల పాటు సుదీర్ఘంగా అలుపెరుగని కృషి చేస్తూ ప్రజలలో ఉద్యమ స్ఫూర్తిని రగిలించిన గొప్ప వ్యక్తి ప్రొఫెసర్ జయశంకర్ అని కొనియాడారు.

ఆయన సేవలను స్మరించుకునేలా ప్రభుత్వం అధికారికంగా జయంతి వేడుకలు నిర్వహిస్తోందని, వ్యవసాయ విశ్వవిద్యాలయానికి ప్రొఫెసర్ జయశంకర్ పేరు పెట్టారని అన్నారు. ఆ మహనీయుడి ఆశయాల సాధనకు అన్ని వర్గాల వారు సమిష్టిగా కృషి చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు.

కాగా, అంతకుముందు కంటేశ్వర్ చౌరస్తాలో గల ఆచార్య జయశంకర్ విగ్రహానికి

అదనపు కలెక్టర్ వి.భుజంగరావు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల బాధ్యులు ప్రొఫెసర్ జయశంకర్ సేవలను శ్లాఘిస్తూ, జయంతి వేడుకలో భాగస్వాములయ్యారు.

ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, ట్రైనీ కలెక్టర్ సురేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, డీఆర్ఓ గీత, ఆర్డీఓ రాజేంద్ర కుమార్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ సందీప్, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఇంచార్జి అధికారిణి రజిత, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



## జయశంకర్ సార్‌కు సిఎం రేవంత్ నివాళి

**హైదరాబాద్, ఆగస్ట్ 6 :** ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా జూబ్లీ హిల్స్‌లోని తన నివాసంలో ఆయన చిత్రపటానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులర్పించారు. సిద్దాంతకర్తగా తెలంగాణ ఉద్యమంలో ప్రొఫెసర్ జయ శంకర్ పాత్ర అత్యంత కీలకమైందని అన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం జీవితాంతం అహర్నిశలు శ్రమించిన మహనీయుడని ఆయన కొనియా దారు. ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాల సాధనకు ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.

## కొత్త తెల్ల రేషన్ కార్డులకు ముహూర్తం ఖరారు

**హైదరాబాద్,ఆగస్ట్6 :** తెలంగాణలో తెల్లరేషన్ కార్డుల పంపిణీకి ముహూర్తం ఖరారైంది. ఆగస్టు 15 నుంచి కొత్త తెల్ల రేషన్ కార్డుల పంపిణీ చేయనున్నట్లు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు.అర్హులైన 1.05 కోట్ల మంది పేదలకు కొత్త రేషన్‌కార్డులు ఇవ్వనున్నట్లు వివరించారు. ఆగస్టు 15న సంగారెడ్డిలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా రేషన్‌కార్డులు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని చెప్పారు. అదే రోజున మొత్తం 119 నియోజకవర్గాల్లో ఒకేసారి రేషన్‌కార్డులు పంపిణీ చేస్తామని వెల్లడించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు అందిస్తామని చెప్పారు.



## ఉమెన్ సేఫ్టీ వింగ్ కస్టడీలో ఉదయ్ కృష్ణారెడ్డి

- ట్రైనీ ఐపిఎస్‌ను ప్రశ్నిస్తున్న పోలీసులు
- నేటితో ముగియనున్న పోలీస్ కస్టడీ

**హైదరాబాద్,ఆగస్ట్6 :** ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డిని ఉమెన్ సేఫ్టీ వింగ్ అధికారులు కస్టడీలోకి తీసుకుని విచారిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం ఐదున్నర గంటల వరకు కస్టడీ కొనసాగనుంది. అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఉమెన్ సేఫ్టీ డీసీపీ లావణ్య నాయక్ ఆధ్వర్యంలో విచారణ జరుగుతోంది. ఈ నేపథ్యంలో డీసీపీ .. అత్తాపూర్ పీఎస్‌కు చేరుకున్నారు. కృష్ణారెడ్డిని డీసీపీ పర్యవేక్షణలో సీఐ జ్యోత్స్న విచారిస్తున్నారు. కస్టడీలో కొత్త విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం. విచారణలో కీలక ఆధారాలు సేకరించే దిశగా పోలీసులు దృష్టి సారించారు. ప్రధానంగా మిస్సైన మొబైల్ ఫోన్‌పై పోలీసులు ఫోకస్ పెట్టారు. ఉదయ్ కృష్ణారెడ్డి రెండో మొబైల్ పైన ఆరా తీస్తున్నారు. మిస్సైన రెండో మొబైల్ దొరికినట్లయితే మరికొన్ని కీలక అంశాలు బయటపడే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే ఉదయ్‌కు సంబంధించిన ల్యాప్‌టాప్, మొబైల్ ఫోన్‌ను పోలీసులు సీజ్ చేసి ఎఫ్ఎస్ఎల్‌కు పంపించారు. హైదరాబాద్‌లోని జాతీయ పోలీస్ అకాడమీలో మహిళా ట్రైనీ ఐపీఎస్‌పై లైంగిక వేధింపుల కేసులో ఉదయ్ కృష్ణారెడ్డిని గత నెల 28న పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. వారం

# జీవితమంతా ముగ్గురు కుమార్తెల కోసమే..

## - చివరికి వీడియో కాల్‌లోనే తండ్రికి వీడ్కోలు..!

**"తన ముగ్గురు కుమార్తెలకు మంచి విద్య అందించి, జీవితంలో ఉన్నత స్థాయికి తీసుకెళ్లడమే లక్ష్యంగా బతికిన ఓ తండ్రి చివరికి ఒంటరిగా కన్నుమూశాడు. మరింత విషాదకరమైన విషయం ఏమిటంటే.. ఆయన అంత్యక్రియలకు ముగ్గురు కుమార్తెల్లో ఒక్కరు కూడా ప్రత్యక్షంగా హాజరు కాలేకపోయారు. నేపాల్, ఉత్తరప్రదేశ్, ముంబైలో ఉన్న వారు వీడియో కాల్ ద్వారానే తమ తండ్రికి కడసారి వీడ్కోలు పలికారు. ఈ హృదయవిదారక ఘటన హర్యానాలోని సోనిపత్‌లో చోటుచేసుకుంది."**



**వేగుచుక్క న్యూస్:**

ముంబైకి చెందిన మాజీ వస్త్ర వ్యాపారి శివచరణ్ రామ్ రతన్ గుప్తా గత ఏడాదిన్నరగా సోనిపత్‌లోని వెస్ట్ రామ్ నగర్‌లో సమాజ్ కళ్యాణ్ శిక్షా సమితి నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలో నివసిస్తున్నారు. ఆయన భార్య మీనా కొంతకాలం క్రితమే మరణించడంతో ఒంటరిగా అక్కడే జీవనం సాగిస్తున్నారు. వయోభారంతో పాటు దీర్ఘకాలిక అనారోగ్యంతో బాధపడుతున్న గుప్తా మంగళవారం (ఆగస్టు 04) తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు.

ఆయన మరణించిన వెంటనే వృద్ధాశ్రమం నిర్వాహకులు ముగ్గురు కుమార్తెలకు సమాచారం అందించారు. అయితే ప్రయాణానికి వీలు కాదని, సోనిపత్‌కు రావడం సాధ్యం కాదని వారు తెలిపారు. దీంతో వృద్ధాశ్రమం నిర్వాహకులు, స్థానిక సామాజిక కార్యకర్తల సహకారంతో గుప్తా అంత్యక్రియలను నిర్వహించారు. ఈ మొత్తం కార్యక్రమాన్ని వీడియో కాల్ ద్వారా కుమార్తెలకు ప్రత్యక్ష ప్రసారం చేశారు. వారు దూరం నుంచే తండ్రి దహన సంస్కారాలను వీక్షించి వీడ్కోలు పలికారు. శివచరణ్ గుప్తా తన కుమార్తెలతో తరచూ ఫోన్‌లో మాట్లాడేవారని వృద్ధాశ్రమ నిర్వాహకుడు ఆనంద్ కుమార్ తెలిపారు. అయితే ఆరోగ్యం క్షీణించిన తర్వాత ఆ సంభాషణలు తగ్గిపోయాయని చెప్పారు. దాదాపు 20 రోజుల ముందే ఆయన పరిస్థితి విషమంగా ఉందని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చినా, వారు వచ్చి చూడలేదని వెల్లడించారు.

**కూతుళ్ళ కోసం జీవితాన్ని ధారపోసి... దిక్కులేని వాడిగా..**

గుప్తాకు కుమారుడు లేకపోవడంతో తన జీవితాన్నంతా ముగ్గురు కుమార్తెల భవిష్యత్తు కోసమే అంకితం చేశారు. వారిని చదివించి ఉన్నత విద్య అందించారు. ప్రస్తుతం పెద్ద కుమార్తె అనిత నేపాల్‌లో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తుండగా, రెండో కుమార్తె నిషా ఉత్తరప్రదేశ్‌లో, చిన్న కుమార్తె ప్రియ ముంబైలో తమ తమ కుటుంబాలతో స్థిరపడ్డారు. తండ్రి అంత్యక్రియలు సక్రమంగా నిర్వహించాలని కోరుతూ అనిత ఫోన్‌లో మాట్లాడిన తీరు అందరిని దిగ్భ్రాంతికి గురి చేసింది. ఆన్‌లైన్ ద్వారా రూ.5,100 పంపించి చేతులు దులుపుకున్నట్లు వ్యవహరించింది. అనంతరం అంత్యక్రియల వీడియోలను కూడా తమకు పంపాలని వృద్ధాశ్రమాన్ని కోరారు.

**అంత్యక్రియలు పూర్తిచేయండి.. మేము భోజనం చేయాలి..!"**

"ఇంకా ఎంత సమయం పడుతుంది.. త్వరగా అంత్యక్రియలు పూర్తిచేయండి.. మేము భోజనం చేయాలి..!" అంటూ వీడియో కాల్‌లో మాట్లాడిన ముగ్గురు కుమార్తెల తీరు హృదయాలను కలచివేస్తోంది. తండ్రి అంత్యక్రియలకు ముగ్గురు కుమార్తెలు ఎవరూ ప్రత్యక్షంగా హాజరుకాలేదు. పెద్ద కుమార్తె ఆన్‌లైన్‌లో డబ్బు పంపగా, వృద్ధాశ్రమం యాజమాన్యం స్థానికుల సహాయంతో దహన సంస్కారాలు నిర్వహించింది. కుమార్తెలు వీడియో కాల్‌లోనే తండ్రికి చివరి వీడ్కోలు పలికారు. అస్థికలను కూడా తామే తీసుకెళ్లకుండా గంగానదిలో నిమజ్జనం చేయాలని కోరారు. ఈ ఘటన కుటుంబ బంధాలు, మానవీయ విలువలపై తీవ్ర చర్చకు దారితీస్తోంది.

ఇదిలావుంటే, గుప్తా కుటుంబ సభ్యుల కోరిక మేరకు ఆయన కళ్లను మరణానంతరం దానం చేశారు. దీంతో ఆయన చూపు అవసరమైన మరో వ్యక్తికి వెలుగునివ్వనుంది. అలాగే మొదట అస్థికలను భద్రపరచాలని కోరిన కుమార్తెలు, అనంతరం తాము రావడం సాధ్యం కాదని చెప్పి వాటిని గంగానదిలో

నిమజ్జనం చేయాలని వృద్ధాశ్రమ యాజమాన్యాన్ని అభ్యర్థించారు. జీవితాంతం పిల్లల కోసమే కష్టపడిన తండ్రికి చివరికి వీడియో కాల్ ద్వారానే వీడ్కోలు పలకాల్సి వచ్చిన ఈ ఘటన సోషల్ మీడియాలో రావడంతో పలువురిని భావోద్వేగానికి గురిచేస్తోంది.



## సచివాలయం ప్రాంగణంలో ఘనంగా బోనాల ఉత్సవాలు

### ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి

**హైదరాబాద్,ఆగస్ట్6 :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో గురువారం సచివాలయ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ వేడుకల్లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ సంజయ్ జాజు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సచివా లయ ఆవరణలోని శ్రీ నల్ల పోచమ్మ అమ్మవారి ఆలయంలో నిర్వహించిన పూజల్లో ప్రధాన కార్యదర్శి పాల్గొని రాష్ట్ర ప్రజలు సుఖశాంతులు, ఆయురారో గ్యాలు, సిరిసంపదలతో వర్ధిల్లాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగులు సంప్రదాయబద్ధంగా బోనాలను సమర్పించగా, పోతరాజుల విన్యా సాలు, డప్పుల వాయిద్యాలు, వివిధ వేషధారణలతో కళాకారుల ప్రదర్శనలు ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పెద్ద సంఖ్యలో ఉద్యోగులు, అధికారులు ఉత్సవాల్లో పాల్గొని భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ప్రధాన కార్యదర్శి శ్రీ సంజయ్ జాజు బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్రంలో సుభిక్షం, శాంతి, అభివృద్ధి నెలకొనాలని ఆకాంక్షించారు.

## నకిలీ ఎన్‌వోసిలపై కొనసాగుతున్న విచారణ

- మరో 48 కాలేజీల చిట్టాను అందజేసిన హైడ్రా
- కాలేజీలపై క్రిమినల్ చర్యలు తీసుకునే అవకాశం

**హైదరాబాద్, ఆగస్ట్ 6 :** ఇంటర్ కాలేజీల నకిలీ ఫైర్ ఎన్ఓసీల వ్యవహారంలో పోలీసుల విచారణ కొనసాగుతోంది. మరో 48 కాలేజీల చిట్టాను హైడ్రా అధికారులు పోలీసులకు అందజేశారు. విచారణలో భాగంగా ఒకే తరహాలో నకిలీ ఎన్ఓసీలు తయారు చేసినట్లు గుర్తించారు. దాదాపు 56 కాలేజీలు నకిలీ ఎన్ఓసీలు సమర్పించినట్లు గుర్తించిన హైడ్రా.. మరో 176 కాలేజీలపై విచారణ జరుపుతోంది. ఐదు అంతస్తులలోపు ఉన్న భవనాల అనుమతుల కోసం ఫైర ఎన్ఓసీలను హైడ్రా ఇస్తుంది. ఆఫ్‌లైన్‌లో ఎన్ఓసీలు మంజూరు చేస్తున్న నేపథ్యంలో కాలేజీ యాజమాన్యాలు అక్రమాలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. ఎన్ఓసీల కోసం హైడ్రాకు దరఖాస్తు చేయకుండానే నకిలీలు సృష్టించి ఇంటర్ బోర్డుకు కాలేజీలు సమర్పించినట్లు విచారణలో వెల్లడైంది. ఒక్కొక్క యూనివర్సిటీకి రూ.6 లక్షల నుంచి రూ.10 లక్షలను కాలేజీ యాజమాన్యాలు ఖర్చుపెట్టినట్లు తెలుస్తోంది. ఎన్‌వోసీల కోసం జీహెచ్ఎంసీ, హైడ్రా, ఫైర్ మాజీ డీజీల సంతకాలను ఫోర్జరీ చేసినట్లు గుర్తించారు. ఆయా కళాశాలల యాజమాన్యాలను అదుపులోకి తీసుకుని పూర్తి స్థాయిలో విచారణ జరిపితే అసలు వాస్తవాలు బయటపడతాయని పోలీసులు భావిస్తున్నారు. హైడ్రా నివేదిక, పోలీసుల విచారణలో బయటపడ్డ అంశాలను ఆధారంగా చేసుకుని కాలేజీ యజమాన్యాలపై క్రిమినల్ చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం.

## విద్యార్థులతో సభకు ఆటంకం

### అనుమతి రద్దుపై మండిపడ్డ రాహుల్

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 6 :** ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో విద్యార్థులతో రాహుల్ గాంధీ నిర్వహించాల్సిన సమావేశానికి అనుమతి రద్దు కావడం వివాదంగా మారింది. ఆగస్టు 8న జరగాల్సిన 'ఛాత్రోంకి గూంజ్' కార్యక్రమానికి రెండు రోజుల ముందే వేదిక అనుమతిని రద్దు చేశారు. ఈ కార్యక్రమం జరగాల్సిన కేపీ గ్రౌండ్ యజమాని అయిన కాయస్థ పాఠశాల ట్రస్ట్.. అలహాబాద్ హైకోర్టు ఆదేశాలను కారణంగా చూపిస్తూ అనుమతిని వెనక్కి తీసుకుంది. 'ఛాత్రోంకి గూంజ్' కార్యక్రమానికి అనుమతి రద్దు చేయడంపై రాహుల్ గాంధీ ఉత్తరప్రదేశ్‌లోని బీజేపీ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. తనను అడ్డుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. అయితే, తనను ఎవరూ ఆపలేరని, విద్యార్థుల సమస్యలపై తన పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. అలహాబాద్ విశ్వవిద్యాలయంలో ఫీజుల పెంపు, సీట్ల తగ్గింపుకు వ్యతిరేకంగా విద్యార్థులు తమ భవిష్యత్తు కోసం పోరాడుతున్నారని రాహుల్ తెలిపారు. వారి సమస్యలను వినకుండా వారిపై కేసులు పెడుతున్నారని ఆరోపించారు. యువత గొంతును అణచివేయడమే ప్రభుత్వ విధానమని, ప్రశ్నిస్తే లాఠీ దెబ్బలు, నిరసన చేస్తే కేసులు, మాట్లాడితే కఠిన చర్యలు తీసుకుంటున్నారని రాహుల్ గాంధీ సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. విద్యార్థుల సమస్యలను తెలుసుకోవడానికి తాను ప్రయాగ్‌రాజ్‌కు రావాలని నిర్ణయించుకున్నప్పటి నుంచి తన కార్యక్రమాన్ని అడ్డుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన అన్నారు. విద్యార్థుల గొంతుకు ప్రభుత్వం భయపడుతోందని విమర్శించారు. ఎన్ని అడ్డంకులు వచ్చినా విద్యార్థులకు అండగా ఉంటానని రాహుల్ స్పష్టం చేశారు.

# యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం నా బాధ్యత..

## మెగా జాబ్ మేళాతో 2 వేలకు పైగా ఉద్యోగాలు...

## నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలి..

## అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ వెల్లడి...

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:**

యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం ప్రజాప్రతినిధిగా నా బాధ్యత అని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 9వ తేదీన జిల్లా కేంద్రంలోని ఆర్మూర్ రోడ్ లో గల శ్రీరామ గార్డెన్ లో మెగా జాబ్ మేళా



నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. ఇందులో 60 కి పైగా ప్రముఖ జాతీయ, అంతర్జాతీయ కంపెనీలు పాల్గొంటున్నాయని తెలిపారు. ప్రధానంగా 2 వేలకు పైగా ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, ఐటిఐ, డిప్లమా, డిగ్రీ, బీటెక్, పీజీ తదితర విద్యార్హతలు కలిగిన యువతీ యువకులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పరిశ్రమలకు నిరుద్యోగులకు మధ్య వారధిగా నిలిచి స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకే ఈ మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు. నిజామాబాద్ యువతలో ఎంతో ప్రతిభ ఉందని, వారికి సరైన మార్గదర్శనం అందించడం తన బాధ్యత అని పేర్కొన్నారు. ఉద్యోగాల కోసం హైదరాబాద్ బెంగళూరు వంటి నగరాలకు వెళ్లాల్సిన పరిస్థితిని తగ్గించేందుకు ప్రముఖ కంపెనీలను నేరుగా ఇందూరుకు తీసుకురావడం కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని చెప్పారు. అర్హత కలిగిన ప్రతి అభ్యర్థి బయోడేటా విద్యార్హతల ధ్రువపత్రాల ప్రతులు, ఆధార్ కార్డు పాస్పోర్ట్ సైజు ఫోటోలతో ఉదయం 9 గంటల నుంచి హాజరుకావాలని కోరారు. అలాగే జాబ్ మేళా కు సహకరిస్తున్న కంపెనీలు, వాలంటీర్లు, భాగస్వామ్య సంస్థలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# నవ్వులతో అలరించనున్న కొరియన్ కనకరాజు



మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ కథానాయకుడిగా నటించిన హారర్--కామెడీ చిత్రం 'కొరియన్ కనకరాజు'లిఆగస్టు 7న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. దర్శకుడు మేర్లపాక గాంధీ రూపొందించిన ఈ చిత్రంలో రితికా నాయక్ కథానాయికగా నటించగా, ప్రముఖ హాస్యనటుడు సత్య కీలక పాత్రలో కనిపించనున్నారు. విడుదలకు ముందే సెన్సార్ ప్రక్రియను పూర్తి చేసుకున్న ఈ సినిమాపై సినీ వర్గాల్లో మంచి స్పందన వ్యక్తమవుతోంది.

'వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్', 'ఎక్స్‌ప్రెస్ రాజా' వంటి విజయవంతమైన హాస్య చిత్రాలతో గుర్తింపు పొందిన దర్శకుడు మేర్లపాక గాంధీ మరోసారి తనదైన వినోదాత్మక శైలిని ఈ చిత్రంలో ఆవిష్కరించినట్లు తెలుస్తోంది. తొలి భాగం నుంచి చివరి వరకు పలు హాస్య సన్నివేశాలు ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తాయని సినీ వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా విరామానికి ముందు, తర్వాత వచ్చే ఎపిసోడ్‌లు చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని సమాచారం. వరుణ్ తేజ్, సత్య మధ్య సాగే హాస్య ఘట్టాలతో పాటు 'బుల్లిరాజు' పాత్ర చుట్టూ తిరిగే సన్నివేశాలు ప్రేక్షకులను విపరీతంగా అలరిస్తాయని టాక్ వినిపిస్తోంది. ఈ చిత్రంలో వరుణ్ తేజ్ రెండు భిన్నమైన కోణాలు కలిగిన పాత్రలో కనిపించనున్నాడు. అనంతపురం జిల్లా పెనుగొండకు చెందిన అమాయక యువకుడు కనకరాజుగా ఒకవైపు కనిపిస్తే, కొరియా గ్యాంగ్‌స్టర్ ఆత్మ ఆవహించిన తర్వాత పూర్తిగా భిన్నమైన వ్యక్తిత్వంతో మరోవైపు కనిపించనున్నట్లు తెలుస్తోంది. ఈ రెండు పాత్రల మధ్య హావభావాలు, సంభాషణ తీరు, శరీర భాషలో వరుణ్ తేజ్ మంచి వైవిధ్యాన్ని ప్రదర్శించినట్లు చిత్రబృందానికి దగ్గరగా ఉన్నవారు చెబుతున్నారు. వినోదంతో పాటు నటనకు కూడా ప్రాధాన్యం ఇచ్చే పాత్రలో ఆయన ఆకట్టుకున్నారని సమాచారం. చిత్ర కథ కూడా ఆసక్తికరమైన నేపథ్యంలో సాగుతుంది. ఆంధ్రప్రదేశ్‌లోని కియా పరిశ్రమలో ఉద్యోగం కోసం కొరియా నుంచి వచ్చిన యువతి పాత్రలో రితికా నాయక్ నటించారు. ఆమెను ప్రేమించే కనకరాజు జీవితంలో అనుకోని సంఘటనలు చోటుచేసుకుంటాయి. కొరియా నుంచి వచ్చిన ఒక సీసాలో బంధించబడిన గ్యాంగ్‌స్టర్ ఆత్మ బయటకు వచ్చి కనకరాజును ఆవహించడంతో కథ కొత్త మలుపు తిరుగుతుంది. ఆ ఆత్మకు కొరియాతో ఉన్న సంబంధం ఏమిటి? కనకరాజు జీవితంలో ఎలాంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి? చివరకు సమస్య ఎలా పరిష్కారమైంది? అనే అంశాల చుట్టూ కథ సాగుతుందని తెలుస్తోంది. సంగీత దర్శకుడు ఎస్. థమన్ అందించిన నేపథ్య సంగీతం, పాటలు చిత్రానికి మరింత బలం చేకూర్చాయని సినీ వర్గాలు పేర్కొంటున్నాయి.



# తండ్రే దేవుడు.. దివ్యాంగుల పిల్లలను వదిలేయకండి


## నటి అభినయ భావోద్వేగం!

ప్రముఖ నటి అభినయ, ఆమె తండ్రి ఆనంద్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొని తమ కుటుంబ బంధాలు, అభినయ కెరీర్ మరియు ఆమె జీవిత దృక్పథం గురించి పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. అభినయ తన శారీరక లోపాన్ని ఎప్పుడూ ఒక సమస్యగా భావించలేదని, ప్రతీ సవాలును ధైర్యంగా ఎదుర్కొంటుందని ఆమె తండ్రి తెలిపారు. తండ్రే నా దేవుడు.. నానమ్మే నా ఊపిరి తమ కుటుంబ అనుబంధం గురించి అభినయ మాట్లాడుతుంటే ఉద్వేగానికి గురయ్యారు. "మా నాన్న నటుడు కావాలని కలలు కన్నారు, ఆయన కలను నేను నెరవేర్చడం ఎంతో సంతోషంగా ఉంది. నా దృష్టిలో మా నాన్న దేవుడితో సమానం" అని కొనియాడారు. అలాగే తానీ రోజు నడుస్తూ, సైన్ లాంగ్వేజ్‌లో మాట్లాడుతున్నానంటే దానికి నానమ్మే కారణమని, ఆమె తనకు జీవితాన్ని ఇచ్చిందని రుణపడి ఉంటానని తెలిపారు. డిప్రెషన్‌కు చోటు లేదు తన పరిస్థితిని సహజంగానే అంగీకరించానని, జీవితంలో ఎప్పుడూ డిప్రెషన్‌కు గురికాలేదని అభినయ స్పష్టం చేశారు. చెన్నైలోని ఓ ఇన్‌స్టిట్యూట్‌లో డ్యాన్స్ ప్రదర్శించిన జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ, నృత్యం పట్ల తనకున్న మక్కువను చాటుకున్నారు. భవిష్యత్తులో పెళ్లి తర్వాత దేవుడి ప్లాన్ ఎలా ఉంటే అలా జరుగుతుందని అన్నారు.

# సెప్టెంబరు 25న నాని కీర్తి పోటీ?

న్యాచురల్ స్టార్ నాని కథానాయకుడిగా, కయాదు లోహర్ కథానాయికగా మాస్ దర్శకుడు శ్రీకాంత్ ఓదెల తెరకెక్కిస్తున్న భారీ చిత్రం 'ది ప్యారడైజ్' విడుదలకు సిద్ధమవుతోంది. 'దసరా' తర్వాత ఈ క్రేజీ కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో ప్రేక్షకుల్లో ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రాన్ని సెప్టెంబరు 25న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయాలని చిత్రబృందం సన్నాహాలు చేస్తున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే అదే తేదీన ప్రముఖ నటి కీర్తి సురేష్ ప్రధాన పాత్రలో నటిస్తున్న 'డోరతి'లిచిత్రం కూడా ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు ఇప్పటికే అధికారిక ప్రకటన వెలువడింది. ప్రముఖ తమిళ దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రానికి సంగీత దిగ్గజం ఇళయరాజా స్వరాలు సమకూరుస్తున్నారు. ప్రస్తుతం 'డోరతి' విడుదల తేదీని తమిళ వెర్షన్‌కు మాత్రమే ఖరారు చేసినప్పటికీ, తెలుగు అనువాద చిత్రాన్ని కూడా అదే రోజున విడుదల చేస్తే బాక్సాఫీస్ వద్ద నాని, కీర్తి సురేష్ చిత్రాల మధ్య నేరుగా పోటీ నెలకొనే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. 'దసరా' చిత్రంలో కలిసి నటించిన నాని, కీర్తి సురేష్ మంచి స్నేహితులుగా గుర్తింపు పొందారు. అలాంటి ఇద్దరు నటీనటుల చిత్రాలు ఒకే తేదీన ప్రేక్షకుల ముందుకు వస్తాయనే ప్రచారం సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. అయితే రెండు చిత్రాల విడుదల తేదీలు ఖరారయ్యే వరకు పరిస్థితిలో మార్పులు వచ్చే అవకాశాన్ని కూడా కొట్టిపారేయలేమని సినీ వర్గాలు పేర్కొంటున్నాయి. విడుదల తేదీలపై చిత్రబృందాల నుంచి త్వరలోనే అధికారిక స్పష్టత వచ్చే అవకాశం ఉంది.










# శోభిత పాత వ్యాఖ్యలు వైరల్

## సోషల్ మీడియాలో చర్చ

అక్కినేని కుటుంబ కోడలు, ప్రముఖ నటి శోభిత ధూళిపాళ మరోసారి సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారారు. అయితే ఈసారి కారణం ఆమె కొత్త సినిమా కాదు.. గతంలో రాజకీయాలపై చేసిన వ్యాఖ్యలు. కొన్ని సంవత్సరాల క్రితం ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఆమె వ్యక్తం చేసిన అభిప్రాయాలకు సంబంధించిన వీడియో ప్రస్తుతం మళ్లీ వైరల్ అవుతోంది. దీంతో సామాజిక మాధ్యమాల్లో దీనిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆ ఇంటర్వ్యూలో శోభిత తన రాజకీయ ఆలోచనల గురించి మాట్లాడుతూ, తనకు వామపక్ష భావజాలంపై ఆసక్తి ఉందని, భవిష్యత్తులో ఒక రోజు కమ్యూనిస్టు సిద్ధాంతాలే విజయం సాధిస్తాయని అభిప్రాయపడ్డారు. ఆ సమయంలో పెద్దగా చర్చకు రాని ఈ వ్యాఖ్యలు ఇప్పుడు మరోసారి వెలుగులోకి రావడంతో సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా చర్చ జరుగుతోంది. వీడియో వైరల్ కావడంతో కొందరు నెటిజన్లు శోభిత వ్యాఖ్యలను విమర్శిస్తున్నారు. సినీ రంగంలో విజయవంతమైన కెరీర్‌తో పాటు విలాసవంతమైన జీవితం గడుపుతూ కమ్యూనిస్టు భావజాలం గురించి మాట్లాడటం విరుద్ధంగా ఉందని వ్యాఖ్యానిస్తున్నారు.




# విలన్‌గా మెప్పించిన ప్రదీప్ రావత్‌కు వీడ్కోలు

తెలుగు, హిందీ సహా పలు భారతీయ భాషల చిత్రాల్లో విలక్షణ నటనతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ప్రముఖ నటుడు ప్రదీప్ రావత్ మృతి సినీ పరిశ్రమను విషాదంలో ముంచెత్తింది. 'శత్రువు', 'గజినీ' వంటి చిత్రాల్లో ప్రతినాయకుడిగా తనదైన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఆయన భౌతికంగా దూరం కావడం సినీ రంగానికి తీరని లోటుగా భావిస్తున్నారు. దాదాపు 150కు పైగా చిత్రాల్లో విభిన్న పాత్రలు పోషించిన ప్రదీప్ రావత్ తన నటనతో ప్రత్యేక ముద్ర వేశారు. సినీ వర్గాల సమాచారం ప్రకారం ఆయన సుమారు రూ.41 కోట్ల విలువైన ఆస్తులను సంపాదించినట్లు తెలుస్తోంది. కెరీర్ అత్యున్నత దశలో ఉన్న సమయంలో రోజుకు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు పారితోషికం అందుకునే విలన్ నటుల్లో ఆయన ఒకరిగా నిలిచారు. కష్టపడి ఎదిగి నటుడిగా, ఆర్థికంగా కూడా ఉన్నత స్థాయిని చేరుకున్నారు.

# బాక్సాఫీస్ వద్ద నిరాశపరిచిన కాజల్ అగర్వాల్ 'ది ఇండియా స్టోరీ'!

'లక్ష్మీ కళ్యాణం' సినిమాతో తెలుగు తెరకు పరిచయమై, స్టార్ హీరోలందరి సరసన నటించి గుర్తింపు తెచ్చుకున్న కథానాయిక కాజల్ అగర్వాల్‌కు హిందీలో ఎదురుదెబ్బ తగిలింది. ఆమె ప్రధాన పాత్రలో నటించిన సామాజిక కోర్ట్‌రూమ్ డ్రామా చిత్రం 'ది ఇండియా స్టోరీ' థియేటర్లలో విడుదలై బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాన్ని సాధించలేకపోయింది.



చేతన్ డి.కె దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో కాజల్ అగర్వాల్‌తో పాటు శ్రేయస్ తల్పడే, మురళీ శర్మ ముఖ్య పాత్రలు పోషించారు. నిత్యం మనం తినే ఆహార పదార్థాలు, కూరగాయలలోని రసాయన కల్తీ మరియు పురుగుమందుల తయారీలోని అవినీతి నేపథ్యంతో ఈ కథ సాగుతుంది. కల్తీ ఆహారం వల్ల బ్లడ్ క్యాన్సర్‌తో ఒక చిన్నారి మరణించగా, ఆ పాప తండ్రి కార్పొరేట్ వ్యవస్థపై చేసే న్యాయపోరాటంలో కాజల్ అగర్వాల్ లాయర్‌గా మద్దతుగా నిలుస్తుంది. జీ స్టూడియోస్ సమర్పణలో సాగర్ బి. షిండే నిర్మించిన ఈ చిత్రం సెన్సార్ ఆలస్యం కారణంగా జూలై 24న కేవలం హిందీ వెర్షన్‌లోనే విడుదలైంది. సుమారు రూ.30 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ సినిమా మొదటి రెండు రోజుల్లో వరుసగా రూ.16 లక్షలు, రూ.25 లక్షలు మాత్రమే రాబట్టింది.